క్లుప్తంగా

ఎంఎల్ఎస్ పాయింట్ పరిశీలన



గోదాంను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమల్

సాలూరు: పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమల్ మంగళవారం పరిశీలించారు. స్టాక్ రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ మురళీకృష్ణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

55 శాతం రాయితీపై పైపులు

సీతానగరం: మండలంలోని వ్యవసాయ భూములకు అవసరమైన నల్ల పైపులు రాయితీపై పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఏఓ ఎస్.అవినాష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయం చేస్తున్న చిన్న, సన్నకారు రైతులు, 5 ఎకరాల భూమి కలిగిన వారికి ప్రభుత్వం రాయితీపై ఏపీఎంఐపీ, జైన్ కంపెనీలకు చెందిన 30, పైపులు, 5 స్ప్రింక్లర్లు 55 శాతం రాయితీపై పొందవచ్చని చెప్పారు. పైపులున్నంత వరకూ రాయితీపై పంపిణీ చేస్తారని అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలన



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ బి. జగన్నాథ రావు

పార్వతీపురంటౌన్: మండలంలోని పెద బొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ బి.జగన్నాథ రావు మంగళవారం పరిశీలించారు. ఆశా–డే సందర్భంగా పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు, సీహెచ్ డబ్ల్యూఓలు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ వి.అనూష, డాక్టర్ జి.ధరణి ఎంపీహెచ్ఈఓ వెంకట్ నాయుడు సిబ్బంది, ఆశ కార్యకర్తలు, సీహెచ్‌డబ్ల్యూఓలు పాల్గొన్నారు.

ఐటీఐలో మిగులు సీట్లకు 4న కౌన్సెలింగ్

గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐలో మిగులు సీట్లలో ప్రవేశాలకు ఈనెల 4న రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3వ తేదీనే కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ఆదివాసీ సంఘాలు అదే రోజు మన్యం బంద్‌కు పిలుపునివ్వడంతో 4వ తేదీకి కౌన్సెలింగ్‌ను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి 4వ తేదీన కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

కొండాపురం విద్యార్థిని ప్రతిభ



మాకెన స్నిగ్ధప్రణవ

పాలకొండ: ఇంటర్నేషనల్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ (ఐపీఎం) నిర్వహించిన పరీక్షల్లో మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన మాకెన స్నిగ్ధ ప్రణవ ప్రతిభ కనబరించింది. ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన ఈ పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. అందులో ఆమె మంచి ర్యాంకు సాధించడంతో పాటు ఐఐఎం రాంచీలో సీటు పొందింది. స్నిగ్ధప్రణవ తండ్రి, వ్యక్తిత్వ వికాసనిపుణుడు మాకెన సతీష్, తల్లి శిరీష తమ కుమార్తెకు జాతీయ స్థాయి విశ్వవిద్యాలయంలో సీటు రావడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మారుమూల గ్రామాల్లో ఆధార్ సేవలందించాలి



కిట్లు పంపిణీ చేస్తున్న ఏపీఓ రోసిరెడ్డి

సీతంపేట: మారుమూల గిరిజన గ్రామాలకు ఆధార్ సేవలు అందించాలని ఐటీడీఏ ఏపీఓ రోసిరెడ్డి అన్నారు. బ్లూ 3 ఐటీ సొల్యూషన్స్, విద్యాశాఖ కొత్తగా మంజూరు చేసిన 5 ఆధార్ మొబైల్ కిట్లును స్థానిక వైటీసీలో మంగళవారం ఆపరేటర్లకు అందజేశారు. గిరిజనులకు ఆధార్ సేవలపై అవగాహన కల్పించి వారికి అవసరమైన సేవలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో బ్లూ3 ఐటీ సొల్యూషన్ ప్రతినిధులు కమలాకర్, డేవిడ్, నాగరాజు పాల్గొన్నారు.

10 లీటర్ల సారా పట్టివేత

వీరఘట్టం: మండలంలోని హుస్సేనుపురం వద్ద నిమ్మకాయల ప్రసాద్ అనే వ్యక్తి సారా తరలిస్తుండగా మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.వి.రమణ తెలిపారు. సారా తయారీ, విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

మారిన పేదల తలరాత

• ఎమ్మెల్యే జోగారావు



చిలకలపల్లిలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందించి వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన తరువాత రాష్ట్రంలో పేదల తలరాతలు మారాయని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. మండలంలోని చిలకలపల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సీఎం అయిన తరువాత నెరవేర్చి పేదలపెన్నిధిగా పేరొందారన్నారు. ఇచ్చిన మాటప్రకారం క్రమం తప్పకుండా సంక్షేమ పథకాలను అమలుచేస్తూ పేదవారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదలు పేదలుగానే మిగిలారని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పేదల తలరాత మారి అభివృద్ధి ఫలాలను అందుకుంటున్నారన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, జీవనోపాధి మెరుగుదలతో పేదల జీవితాల్లో కాంతులు విరజిమ్ముతున్నాయని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తూ నిరుపేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రజలకు ఇంతకన్నా ఏమి సేవలు చేయాలని ప్రజలను ప్రశ్నించారు. రానున్న ఎన్నికలలో జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరరావు, ఎంపీటీసీ మల్లిక, ఏఓ భానుమూర్తి, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, టి.ప్రసాద్, జగన్నాథం మాస్టారు, బలిజకార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, సర్పంచ్ కె.మోహనరావు, ఎస్.పాపారావు, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, జి.జగన్, జి.శ్రీనివాసరావు, జి.సత్యం నాయుడు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



కాలువ పనుల వద్ద అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు

తోటపల్లి డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనుల పరిశీలన

తోటపల్లి కుడికాలువ నుంచి పెదపెంకి డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పరిధిలో మైనర్ కాలువ పనులను ఎమ్మెల్యే జోగారావు మంగళవారం పర్యవేక్షించారు. 450మీటర్ల కాలువ పనులను త్వరగా పూర్తిచేసి రైతులకు సాగునీరు అందేవిధంగా చూడాలని అధికారులకు సూచించారు.

డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పరిధిలో ఉండే అన్ని చెరువులను అనుసంధానం చేసి పంటపొలాలకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. కాలువ దిగువన ఉన్న పాటిచెరువుతో పాటు చుట్టుపక్కల ఉండే చెరువులకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వర్షాధార భూములకు సాగునీరు అందించడం వల్ల రైతులకు పుష్కలంగా పంటలు పండే అవకాశాలుంటాయని తెలిపారు. సాగునీరు అందించేందుకు కాలువ బట్టి తవ్వేటప్పుడు రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి, జి.జగన్, శ్రీనివాసరావు, తోటపల్లి ప్రాజెక్టు డీఈఈ రఘునందననాయుడు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు

పార్వతీపురంటౌన్: నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా పార్వతీపురం నియోజకవర్గానికి సంబంధించి మంగళవారం స్థానిక సాయిరాం డిగ్రీ కాలేజీ ఆవరణంలో మినీ జాబ్ మేళా నిర్వహించామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయి కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మినీ జాబ్‌మేళాకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, సినర్జీ కాస్టింగ్ నిలిటెడ్, నాగార్జున ఫెర్టిలైజర్స్/కెమికల్స్ కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారన్నారు. ఈ జాబ్ డ్రైవ్‌కు సుమారు 116 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా 45 మంది శ్రీరామ్ లైఫ్ ఇన్స్యూరెన్స్, సినర్జీ కాస్టింగ్ నిలిటెడ్, నాగార్జున ఫెర్టిలైజర్స్/కెమికల్స్ కంపెనీలలో ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో సాయిరాం డిగ్రీ కాలేజీ కరెస్పాండెట్ పెంట అప్పారావు, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ మనోజ్ కుమార్, ఏపీఎస్ఎస్‌డీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో మాతా, శిశు ఆరోగ్య కార్యక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

• డీఐఓ జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: మాతా, శిశు ఆరోగ్య కార్యక్రమాలు పూర్తి స్థాయిలో నిర్వహించి, వారి ఆరోగ్య శ్రేయస్సు కోసం కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. ఈ మేరకు జిల్లా ఆస్పత్రిలో ఉన్న పీపీ యూనిట్‌లో పట్టణ ఆరోగ్య సిబ్బందికి వైద్యాధికారి డాక్టర్ వై. విజయమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు, శిశువులకు ఆశ కార్యకర్తలు అందజేసిన వైద్య సేవలను ఎప్పటికప్పుడు ఇ–ఆశ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ నెల మొదటి వారం తల్లి పాల వారోత్సవాల సందర్భంగా బిడ్డకు తల్లి పాల ఆవశ్యకతపై అవగాహన కల్పించడం ద్వారా బిడ్డ ఎదుగుదలకు వీటి ప్రాముఖ్యాన్ని వివరించాలని సూచించారు.

అదేవిధంగా ఈ నెల7 నుంచి 12 మధ్య నిర్వహించనున్న మిషన్ ఇంద్ర ధనుష్ ప్రోగ్రామ్‌కు సర్వేలో గుర్తించిన టీకా అర్హులందరినీ కొత్తగా చేర్చిన యూవిన్ పోర్టల్‌లో నమోదును వైద్యసిబ్బంది త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి పి.లావణ్య, సూపర్‌వైజర్స్ బి.పుష్ప, జయగౌడ్, స్టాఫ్ భారతి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బడి బయట పిల్లల గుర్తింపు

సీతంపేట: మండలంలో బడిబయట ఉన్న ఇద్దరు బాలికలను గుర్తించి బడిలో చేర్పించినట్లు పీఎంఆర్‌సీ సీఎంఓ పాట్నూరు కోటిబాబు, జీసీడీఓ రాములమ్మ తెలిపారు. మండలంలోని శిలిగాం గ్రామంలో ఇద్దరు పిల్లలు ఐదో తరగతి వరకు చదివి బడి మానేసినట్లు గుర్తించి మంగళవారం వారి ఇంటికి వెళ్లారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులను ముత్యాలు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతిలో చేర్పించినట్లు చెప్పారు.

తోటపల్లి దేవస్థానం కార్యవర్గ సభ్యునికి సత్కారం



పాత్రోను సన్మానిస్తున్న ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామానికి చెందిన గౌరీశంకర పాత్రోకు తోటపల్లి దేవస్థానం కార్యవర్గంలో చోటు కల్పించడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, ఎస్సై షణ్ముఖరావు, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ యుగంధర్, తదితరులు మంగళవారం ఆయన్ని సత్కరించారు. ఈ సందర్భంగా తనకు కార్యవర్గంలో చోటు కల్పించినందుకు ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

భామిని: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ జి.చంద్రరావు మంగళవారం పరిశీలించారు. భోజనాలు ఎలా ఉంటున్నాయి, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటలు రుచిగా ఉండాలని, మెనూ కచ్చితంగా అమలు చేయాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు.

మన్యం బంద్‌కు ప్రజలు సహకరించాలి

కురుపాం: మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న దమనకాండకు నిరసనగా ఆదివాసీ సంఘాల పిలుపుమేరకు ఈ నెల 3న మన్యం బంద్‌కు ప్రజలు సహకరించాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక గౌరవ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణ మూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గత నాలుగు నెలలుగా మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు జరుగుతున్నా అక్కడ అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం శాంతి భద్రతలను కాపాడాల్సింది పోయి చోద్యం చూస్తోందని మండిపడ్డారు. ఆదివాసీ మహిళలపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఈ నెల 3న చేపట్టే మన్యం బంద్‌లో ప్రజలంతా పాల్గొని మద్దతు తెలపాలని కోరారు.

తెల్లవారకుండానే లబ్ధిదారుల చేతిలో పింఛన్



సీతానగరం: అప్పయ్యపేటలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న సచివాలయ కన్వీనర్ సూర్యనారాయణ



సీతానగరం: చినభోగిలిలో దివ్యాంగుడికి రూ.3 వేలు పింఛన్ అందిస్తున్న కన్వీనర్ శ్రీనివాసరావు



సీతానగరం:తామరఖండిలో పింఛన్ పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ మన్మథరావు

సీతానగరం:

ఒకటో తేదీ వచ్చిందంటే పింఛన్‌దారుల ముఖాల్లో అలవికాని ఆనందం కనిపిస్తుంది. ఆగస్టు 1 వ తేదీ రావడంతో గ్రామ వలంటీర్లు పింఛనర్ల ఇంటి తలుపు తట్టి పింఛన్ కానుకలను సచివాలయ కన్వీనర్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్ పర్యవేక్షణలో పంపిణీ చేయడంతో వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పార్వతీపురం వెళ్లి పింఛన్ అందజేత

బలిజిపేట: మండలంలోని అజ్జాడకు చెందిన అక్కేన నారాయణమ్మ అనారోగ్యంతో బాధపడుతూ పార్వతీపురంలో ఉంటోంది,. నారాయణమ్మ పక్షవాతంతో బాధపడుతుండడంతో పింఛన్ అందుకోవడానికి రాలేకపోగా వలంటీర్ ఎ.నగేష్ పార్వతీపురం వెళ్లి ఆమెకు పింఛన్ మొత్తం అందించాడు. దీంతో లబ్ధిదారుల బంధువులు, గ్రామస్తులు, వలంటీర్‌ను అభినందించారు.



సీతానగరం: వికలాంగుడికి ఇంటి వద్ద పింఛన్ అందజేస్తున్న సచివాలయ కన్వీనర్ గౌరునాయుడు



బలిజిపేట: పార్వతీపురంలో లబ్ధిదారుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్

వినతులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ ఎస్ ప్రసాద్

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిష్కరించడానికి పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ ఎంఎల్ఎస్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులతో వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష కార్యక్రమంలో వచ్చిన వినతుల పరిష్కార విషయమై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వచ్చిన ఫిర్యాదులు వినతుల రూపంలో వచ్చిన అర్జీలన్నీ నిర్దేశించిన గ్రామాల్లో గ్రామ పెద్దల సమక్షంలో సున్నితంగా పరిష్కరించడానికి కార్యదర్శులు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే వర్షాలు కురుస్తున్న కారణంగా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయించాలని, తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని లేని పక్షంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కార్యదర్శులు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు ఏమేరకు పూర్తయ్యాయి? ఎంతసమయంలో లోగా లబ్ధిదారులు పూర్తి చేయగలరో తెలుసుకోవాలని కోరారు. గ్రామాల్లో వివిధ కారణాలతో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు లబ్ధిదారులతో చర్చించి గడువులోగా పూర్తి చేస్తామని తెలిపారు.

ఓటరు నమోదుకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

పార్వతీపురం: ఓటరు నమోదు కార్యక్రమానికి సహకరించాలని పార్వతీపురం ఓటరు నమోదు అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం ఆమె వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఇంటింటికీ ఓటరు ధ్రువీకరణ కార్యక్రమం జూలై 21 నుంచి జరుగుతోందని తెలిపారు. 10 కంటే ఎక్కువ ఫారాలను బీఎల్ఓకు సమర్పించకూడదనే షరతులకు లోబడి ఎన్నికల సంఘం బూత్ లెవెల్ ఏజెంట్లను అనుమతించిందని చెప్పారు. బూత్ లెవల్ ఏజెంట్లు సమర్పించిన దరఖాస్తులన్నింటికీ ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని స్పష్టం చేశారు. డూప్లికేట్ ఎంట్రీలు, చనిపోయిన ఓటర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల వివరాల పరిశీలన, ఓటర్ల జాబితాలో సవరణలు ఉంటే గుర్తిస్తారని పేర్కొన్నారు. చిరునామా మార్చుకున్న ఓటర్ల వివరాలు, డోర్ నంబర్ అడ్రస్ వెరిఫికేషన్ (10 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ఇళ్లు) చేస్తారని చెప్పారు. ముసాయిదా ఓటరు జాబితా అక్టోబరు 27న ప్రచురిస్తామని, అక్టోబరు 17 నుంచి నవంబరు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు సమర్పించవచ్చని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్లు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుల ఆధ్వర్యంలో నమూనా పంటలు



ఏటీఎం మోడల్ విధానంలో పంటల సాగును పరిశీలిస్తున్న డీపీఎం షణ్ముఖ రాజు

పార్వతీపురంటౌన్: మండలంలోని పెద్ద బొండపల్లి, పుట్టూరు గ్రామాల్లో రైతుల ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సాగు ద్వారా ఒకే చోట సాగు చేపట్టిన కూరగాయల నమూనా పంటలను డీపీఎం షణ్ముఖ రాజు మంగళవారం పరిశీలించారు. రైతులు ఒకే ప్లాట్‌లో 10 నుంచి 14 రకాల కాయగూరలు ఆకు కూరలు, దుంప జాతి సాగు ద్వారా మంచి ఆహార పదార్థాలు లభిస్తాయని ఈ సందర్భంగా ఆయన అన్నారు. దీనినే ఏటీఎం మోడల్‌గా పిలుస్తున్నట్లు తెలిపారు. 15 సెంట్ల భూమిలో పలు పంటల వల్ల రోజుకు రూ.300 నుంచి రూ.500 వరకు ఆదాయం వస్తున్నట్లు రైతులే చెబుతున్నారన్నారు. ప్రతి రైతు ఈ విధంగా ఏటీఎం మోడల్ వేసుకుంటే రోజూ ఆదాయం పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సాగు రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ప్రారంభం



వనరుల విస్తరణ, శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన సిబ్బంది

పార్వతీపురంటౌన్: మండలంలోని సంగంవలస గ్రామంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ వనరుల విస్తరణ, శిక్షణ కేంద్రాన్ని జిల్లా ప్రకృతి వ్యవసాయ అసోసియేట్ సభ్యులు మానస, దేవిప్రసాద్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ వనరుల విస్తరణ, రైతులకు శిక్షణ కేంద్రంగా ఇది పనిచేస్తుందని చెప్పారు. ఈ కేంద్రంలో రైతులకు అన్ని రకాల చీడ పీడలు, తెగుళ్ల నివారణకు సంబంధించిన కషాయాలు, పంట పెరుగుదలకు సంబంధించిన ద్రావణాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ గంట తవుడు, ఐసీఆర్పీలు తేలు శంకరరావు, పెద్దింటి వెంకటనాయుడు రైతులు పాల్గొన్నారు.

గిరిజన గురుకులాల్లో సీట్లు పెంపుపై హర్షం



విశ్వాసరాయి కళావతి, పాలకొండ ఎమ్మెల్యే

సీతంపేట: గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశాలకు సీట్లు పెంచడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి రాజన్నదొరకు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజన గురుకులాల్లో సీట్లు పెంచాలని విద్యార్థుల తల్లిదండ్రుల కోరికను తాను ఐటీడీఏ పీఓ, రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, దీనిపై ప్రభుత్వం, గిరిజన సంక్షేమశాఖ వెంటనే స్పందించి సీట్లు పెంచడం జరిగిందన్నారు. సీతంపేట, పాచిపెంట మినీ గురుకులాల్లో 7వ తరగతి పూర్తి చేసిన బాలికలను సీతంపేట బాలికల గురుకుల పాఠశాల, కురుపాం యూఆర్‌జేసీలో 45 సీట్లు చొప్పున పెంచినట్లు చెప్పారు. ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్ గ్రూపులో 10 సీట్లు చొప్పున మొత్తం 40 సీట్లు అదనంగా పెంచినట్లు వెల్లడించారు. గిరిజన గురుకుల బాలుర జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో 10 చొప్పున మొత్తం 30 సీట్లు పెంచడంతో పాటు విద్యార్థులకు ప్రవేశాలు కూడా కల్పించడం జరిగిందని పేర్కొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు



నడుకూరు వద్ద ప్రధాన రహదారిలో డ్రైనేజీ నిర్మాణానికి కొలతలు వేస్తున్న ఆర్‌అండ్‌బీ సిబ్బంది

వీరఘట్టం:

మండలంలోని నడుకూరు ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణానికి ఆర్ అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు చేపట్టారు. స్థానిక పెట్రోల్ బంక్ నుంచి కిమ్మి రోడ్డు టర్నింగ్ వరకు 200 మీటర్లు పొడువున రోడ్డుకు ఇరువైపులా కాంక్రీట్ కాలువల నిర్మాణం చేపట్టేందుకు ఆర్అండ్‌బీ అధికారులు మంగళవారం కొలతలు వేశారు. ప్రధాన రహదారిలో కాలువలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల గ్రామ సర్పంచ్ కర్రి రమాదేవి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

దీంతో స్పందించిన ఆర్అండ్‌బీ అధికారులు ప్రధాన రహదారిలో 50 అడుగుల రహదారిని వదిలేసి ఇరువైపులా రూ.50 లక్షలతో డ్రైనేజీ నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించారు.